
సాక్షి
ఒడిశా
శనివారం | 4 | జనవరి | 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,44,494లు, బంగారం 1 గ్రాము 50 మిల్లీగ్రాములు, వెండి 105 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత - IIలో

రాయఘడ బ్లాక్ కోయిపూర్ పంచాయతీలో ఉన్న పవిత్ర మహేంద్రగిరి పర్వతాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను అటవీ శాఖ సిబ్బంది, ఎకో డవలప్‌మెంట్ కమిటీ సభ్యులు కలిసి శుక్రవారం ఏరివేత కార్యక్రమం చేపట్టారు.



రోడ్డు నిబంధనలు పాటించాలి

జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు జరుగుతున్నాయి. పర్లాకిమిడిలో ప్రాంతీయ రోడ్డు రవాణా సంస్థ కార్యాలయం నుంచి చైతన్య ర్యాలీని ఆర్టీవో ప్రసన్న కుమార్ దాస్ ప్రారంభించారు. -IIలో

న్యూస్‌రీల్

గవర్నర్‌కు ఏసీఏ అభినందనలు



గవర్నర్‌ను అభినందించిన ఏసీఏ ప్రతినిధి బృందం

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్‌గా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ హరిబాబు కంభంపాటితో స్థానిక ఆంధ్ర సంస్కృతి సమితి (ఏసీఏ) ప్రతినిధి బృందం భేటీ అయింది. కొత్త గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అభినందనలు తెలియజేశారు. సమితి సలహాదారుడు గన్నవరపు ఆనంద రావు ఆధ్వర్యంలో 4 మంది సభ్యుల ప్రతినిధి బృందం గవర్నరుతో సంభాషించింది. ఈ సందర్భంగా సమితి ఆవిర్భావం, కార్యకలాపాలు వగైరా అంశాల్ని సంక్షిప్తంగా వివరించింది. సమితి కార్యకలాపాల్లో పాలుపంచుకుని సహాయ సహకారాలు అందజేయాలని అభ్యర్థించినట్లు ఆనంద రావు తెలిపారు.

బడ్జెట్ రూపకల్పనకు ప్రతిపాదనలు ఆహ్వానం

భువనేశ్వర్: కొత్త ఆర్థిక సంవత్సరం 2025–26 బడ్జెట్ రూపకల్పన కోసం కసరత్తు ఆరంభమైంది. ఈ మేరకు అన్ని వర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలు, ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆహ్వానం పలికింది. సామాన్య ప్రజల నుంచి మొదలుకొని విద్యావేత్తలు, ఆర్థికవేత్తలు, పారిశ్రామిక, వ్యాపారవేత్తలు, వివిధ సంస్థలు ఇతరేతర వర్గాల అభిప్రాయాలను ఆర్థిక శాఖ కోరింది. ఈ నెల 31 వరకు అభిప్రాయాలు, సలహాలు, సూచనల దాఖలుకు గడువు కల్పించింది. 3 విభాగాలలో గరిష్ఠంగా 500 పదాలలో అభిప్రాయాల్ని దాఖలు చేయాల్సి ఉంటుంది. అభిప్రాయాలను వాట్సాప్ నంబరు – 9438161111 కు అభిప్రాయాలు దాఖలు చేసేందుకు వీలవుతుంది. వీటితో రాష్ట్ర ఆర్థిక శాఖ ఫేసుబుక్, ఇన్‌స్టాగాం, ఎక్స్ ఖాతాల ఆధ్వర్యంలో కూడా బడ్జెటు ప్రతిపాదనల్ని ప్రజలు దాఖలు చేసేందుకు అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి జనజాతి మేళాకు ఐదు బృందాలు



వాహనంలో మేళాకు తరలివెళ్తున్న మహిళలు

జయపురం: భువనేశ్వర్‌లో ఈ నెల నాలుగు నుంచి 16వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి జనజాతీయ గౌరవమేళాలో పాల్గొనేందుకు జయపురం నుంచి ఐదు స్వయం సహాయక గ్రూపులు గురువారం సాయంత్రం బయలుదేరి వెళ్లాయి. జయపురం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ద్వారా జయపురం సబ్‌డివిజన్‌లో జయపురం, బొరిగుమ్మ, కొట్‌పాడ్, కుంద్ర, బొయిపరిగుడ, సమితిల నుంచి ఐదు సంఘాల నుంచి పది మంది మహిళలను మేళాకు అధికారులు ఎంపిక చేశారు. జయపురం సబ్‌కలక్టర్, ఐటీడీఏ అడ్మినిస్ట్రేట్ అధికారిణి అక్కవరమ్ శౌశ్య రెడ్డి బృందాలు వెళ్లే వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కొరాపుట్ జిల్లాలో స్వయం సహాయక గ్రూపుల మహిళలు తయారు చేస్తున్న వస్తువులు ముఖ్యంగా అటవీ ఉత్పత్తులతో తయారు చేసే గుగ్గిలం, తేనె, వేప నూనె, ఉసిరి, అగరబత్తి, వ్యవసాయ ఉత్పత్తులు చోళ్లు, పసుపు, ఆవాలు, ఒలుసులు, చిరుధాన్యాలతో తయారు చేసే వస్తువులు ప్రదర్శిస్తారు. జయపురం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ మేనేజర్ దేవాసిస్ పట్నాయక్, జూనియర్ ఇంజినీర్ చైతన్య బస్కె పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని యువ భారత్ కృషక్ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. జిల్లాలోని బిసంకటక్‌లో యువ భారత్ కృషక్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ జరిగింది. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ నిర్వహించిన ర్యాలీలో సంఘం అధ్యక్షులు బాలముకుంద పాయక్ నేతృత్వంలో వినతిపత్రాన్ని ముఖ్యమంత్రి పేరిట తహసీల్దార్ కె.వేంకటేశ్వర్‌కు సమర్పించారు. గత కొద్ది రోజుల క్రితం కురిసిన అకాల వర్షాల కారణంగా రైతులు ఎంతోమంది నష్టపోయారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని, తగిన నష్టపరిహారం చెల్లించాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. బిసంకటక్‌లోని మా మార్కమా మందిరం నుంచి ప్రారంభమైన ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. ర్యాలీలో సంఘం ఉపాధ్యక్షులు సత్యానారాయణ పటిక, కార్యదర్శి జవాబ్ పలక, కోశాధికారి రామదాస్ ఉలక, అధికసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

కొత్త గవర్నర్ ప్రమాణ స్వీకారం



బాధ్యతలు స్వీకరించిన కొత్త గవర్నర్ హరిబాబు



ప్రమాణ స్వీకారోత్సవ వేదికపై చీఫ్ జస్టిస్, ముఖ్యమంత్రితో కొత్త గవర్నర్



రాజ్ భవన్ ప్రాంగణంలో గౌరవ వందనం స్వీకరించిన రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి

భువనేశ్వర్:

రాష్ట్ర కొత్త గవర్నర్‌గా డాక్టర్ హరిబాబు కంభంపాటి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన రాష్ట్రానికి 27వ గవర్నర్. శుక్రవారం ఉదయం 10.10 గంటలకు హరిబాబు కంభంపాటితో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్ ప్రమాణం చేయించారు. స్థానిక రాజ్ భవన్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది.

కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఇరువురు ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా, ప్రతిపక్ష నేత నవీన్ పట్నాయక్, శాసన సభ స్పీకర్ సురమా పాఢి, ఇతర మంత్రి మండలి సభ్యులు, వివిధ యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం కొత్త గవర్నర్‌కు గార్డ్ ఆఫ్ ఆనరు ప్రదానం చేశారు.

భారత రాష్ట్రపతి ఆమోదం మేరకు రాష్ట్ర గవర్నర్‌గా హరిబాబు కంభంపాటి గత నెల 24న నియమితులయ్యారు. గురువారం రాష్ట్రానికి చేరిన కొత్త గవర్నర్ పూరీ వెళ్లి కుటుంబ సమేతంగా శ్రీ జగన్నాథుడిని దర్శించుకున్నారు. పూరీ రాజ్ భవన్‌లో రాత్రి బస చేసిన ఆయన శుక్రవారం ఉదయం భువనేశ్వర్‌కు తిరిగి వచ్చారు. అనంతరం రాజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయ మూర్తి ఆయనతో ప్రమాణం చేయించారు.



కొత్త గవర్నర్‌కు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అభినందనలు



విపక్ష నేత నవీన్ పట్నాయక్‌తో గవర్నర్ సంభాషణ



గవర్నర్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అతిథులు

ఒడిశా రాష్ట్రం అభివృద్ధి చెందాలని, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు కొత్త గవర్నర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ వైబీ ఖురానియా, కటక్, భువనేశ్వర్ జంట నగరాల పోలీస్ కమిషనర్, పలువురు ఉన్నతాధికారులు ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు.

ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లాలో 1953లో జన్మించిన కంభంపాటి హరిబాబు భారత రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం సాధించారు. 1972లో జై ఆంధ్ర ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. విశ్వవిద్యాలయం విద్యార్థి రోజుల్లోనే ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. 1970 దశకంలో ఎమర్జెన్సీ కాలంలో 6 నెలల పాటు కారాగార శిక్ష రాజకీయ కార్యాచరణ పట్ల ఆయనకున్న దృఢ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

కంభంపాటి ఉన్నత విద్యావేత్త. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో బీటెక్, ఆంధ్రా విశ్వ విద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఆయన ఆంధ్ర విశ్వ విద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా 24 సంవత్సరాలు విశేష సేవలు అందించారు. ఈ దశలో ఇంజనీరింగ్ విద్యార్థుల విద్యా అభివద్ధికి గణనీయంగా తోడ్పడి వారి ఉజ్వల భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలను అందించారు. 1977లో జనతా దళ్‌లో చేరడంతో కంభంపాటి ప్రత్యక్ష రాజకీయ పయనం ఆరంభమైంది. ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడంతో రాజకీయంగా ఆయన ప్రాధాన్యత ఊపందుకుంది. 1993 నుండి దశాబ్దం పాటు ఈ హోదాలో కొనసాగారు. 1999లో విశాఖపట్నం–1 నియోజకవర్గం నుంచి అవిభాజిత ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ సభ్యునిగా ఎన్నికయ్యారు.



రాష్ట్ర 27వ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ హరిబాబు కంభంపాటి

ఆయనకు 2005లో బీజేపీ జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించింది. 2014 - 2018 మధ్య ఆంధ్ర ప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా పని చేశారు. 2014 నుండి 2019 వరకు పార్లమెంటు సభ్యునిగా, కంభంపాటి వివిధ పార్లమెంటరీ కమిటీలకు గణనీయమైన సహకారం అందించారు.

అకాల వర్షం రాష్ట్ర విపత్తు

- 2,91,000 హెక్టార్లలో పంట నష్టం
- బాధిత రైతులు దాదాపు 6,66,700 మంది
- సీఎం మోహన్ చరణ్ మాఝి



కృషి ఒడిశా కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగం



వ్యవసాయ ఉత్పాదనల కేంద్రం సందర్శనలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్ర రైతుల సమగ్ర సంక్షేమానికి ప్రభుత్వం సరికొత్త నిర్ణయం ప్రకటించింది. ప్రకృతి వైపరీత్య పీడిత రైతాంగానికి ఆదుకుంటామని ముఖ్యమంత్రి ప్రతిజ్ఞ చేశారు. ఈ నేపథ్యంలో ఒడిశాలో అకాల వర్షాన్ని 'రాష్ట్ర విపత్తు'గా ప్రకటించారు. ఈ మేరకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. స్థానిక బరముండా బిజూ పట్నాయక్ ఆట స్థలం ప్రాంగణంలో కృషి ఒడిశా కార్యక్రమం ప్రారంభోత్సవం పురస్కరించుకుని ప్రసంగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి శుక్రవారం ఈ విషయం ప్రకటించారు.

అకాల వర్షాలతో పంట నీట మునిగింది. ఈ పరిస్థితుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఈ విపత్తును 'రాష్ట్ర విపత్తు'గా ప్రకటించింది. దీని ప్రకారం బాధిత రైతులందరికీ ప్రభుత్వం ఆదుకుంటుందని ప్రతిజ్ఞ చేశారు. కృషి ఒడిశా కార్యక్రమంలో ప్రసంగించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ భూములకు విస్తారమైన నష్టాన్ని కలిగించిన తీవ్రమైన, దీర్ఘకాలిక వర్షాలకు ప్రతిస్పందనగా రాష్ట్ర విపత్తు ప్రకటించారు.

గత ఏడాది డిసెంబర్‌లో రాష్ట్రంలో అల్పపీడన వానలు పంటలను నాశనం చేశాయి. దీంతో లక్షలాది మంది నష్టపోయారు. పలువురు రైతులు ప్రాణాలు సైతం కోల్పోయారు. వీరి మరణం పట్ల ముఖ్యమంత్రి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ, విపత్తు నిర్వహణ సహాయ నిధి కింద బాధిత రైతులందరినీ ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అకాల వర్షపాతాన్ని రాష్ట్ర విపత్తుగా ప్రకటించడం వల్ల బాధిత రైతులకు సహాయం చేసేందుకు రూపొందించిన ప్రభుత్వ సహాయ యంత్రాంగాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో ప్రభుత్వం ఆర్థిక నష్టాన్ని 291 కోట్ల 59 లక్షల రూపాయలుగా అంచనా వేసింది. ఈ ప్రకృతి వైపరీత్యంలో ప్రభావితమైన వారికి అవసరమైన సహాయం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు కృషి చేస్తుంది. బాధితులకు సత్వరమే సాయం అందేలా చూస్తోంది. నష్టాన్ని అంచనా వేయడానికి మరియు సహాయ పంపిణీని సులభతరం చేయడానికి రాష్ట్ర అధికారులు స్థానిక అధికారులతో సమన్వయంగా పని చేస్తున్నారు.

అకాల వర్షాల వల్ల దాదాపు 6,66,700 మంది రైతులు నష్టపోయారు. సమగ్రంగా 2,91,000 హెక్టార్ల విస్తీర్ణం పొలాల్లో పంట దెబ్బతింది. వర్షాభావంతో పంట నష్టపోయి 7 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు సమాచారం. ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించడంతో భారీ పంట నష్టం వాటిల్లి షాక్‌కు గురై రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ సంక్షోభ సమయంలో రైతులకు ఉపశమనం కల్పించేందుకు తగిన నష్ట పరిహారం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలను చేపడుతోంది. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఇతర మంత్రులతో కలిసి బాధిత రైతులను పరామర్శించి వాస్తవ పంట నష్టం పర్యవేక్షణతో బాధిత రైతులకు అండగా నిలుస్తామని అభయం ఇచ్చినట్లు ఈ సభలో గుర్తు చేశారు. ప్రభుత్వం నుంచి ప్రతి ఒక్కరికి సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. బాధిత రైతులందరికీ రాష్ట్ర ప్రకృతి వైపరీత్యాల సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందిస్తారు. 33 శాతం లేదా అంతకంటే ఎక్కువ నష్టపోయిన రైతులకు పరిహారం లభిస్తుంది. పంట నష్టంపై జిల్లా అధికారులు నివేదిక దాఖలైంది. ఈ నివేదిక ప్రకారం రాష్ట్రంలోని 6 లక్షల 66 వేల 720 మంది రైతులకు చెందిన 2 లక్షల 26 వేల 791 హెక్టార్లలో 33 శాతానికి పైగా పంట నష్టం జరిగినట్లు గుర్తించారు.




కృషి ఒడిశా కార్యక్రమం ప్రారంభించిన ముఖ్యమంత్రితో ఇతర మంత్రులు

సుస్థిర ఆహార వ్యవస్థకు ముందడుగు శీర్షికతో ఈ నెల 5వ తేదీ వరకు 3 రోజులపాటు కొనసాగుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రముఖ కార్యదర్శి డాక్టరు అరవింద కుమార్ పాఢి తెలిపారు. పర్యావరణం, పరస్పర అనుసంధాన లక్ష్యాల ద్వారా ఆహార భద్రత మెరుగుపరిచే లక్ష్యంతో ఈ కార్యక్రమం కొనసాగతుంది. రైతులను, స్థానిక ఆర్థిక వ్యవస్థ పటిష్ఠపరిచే దిశలో సహజ వ్యవసాయ విధానాల్ని ప్రోత్సహించేందుకు ఈ సదస్సులో ప్రముఖులు అభిప్రాయాలు వ్యక్తీకరించేందుకు ప్రత్యేక చర్చా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మరమ్మతులు చేపట్టండి

మల్కన్‌గిరి: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి భవనానికి మరమ్మతులు చేపట్టాలని జాతీయ వికాస్ సేన ఒడిశా అధ్యక్షుడు కె.బాలరాజ్ కోరారు. ఈ మేరకు సీఎం మోహన్‌చరణ్ మాఝిని ఉద్దేశించి వినతి పత్రం కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్‌కు శుక్రవారం అందజేశారు. ఆస్పత్రి పైకప్పు, టైల్స్ ఊడిపోయి రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రి వద్ద మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలనుకునే క్రమంగా ఇటువంటి పరిస్థితి దురదృష్టకరమన్నారు.

ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు గంగాధర్ బడనాయిక్, హరి హంతాల్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న వికాస్ సేన సభ్యులు

గొడ్డలితో నరికి వృద్ధుడి హత్య

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి బొదాపుట్ పంచాయతీ అమటిగుడ గ్రామంలో గొడ్డలితో నరికి ఒక వృద్ధుడిని హత్య చేశారు. వృద్ధుడి మృతదేహం సమీప అడవిలో పడి ఉంది. ఆ వృద్ధుడు ఆ గ్రామానికే చెందిన సదన పంగి అని వెల్లడైంది. అతడి కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు వెంటనే మృతదేహం ఉన్న ప్రాంతానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అయ్యాక కుటుంబ సభ్యులకు అప్పగించామని బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజళి ప్రధాన్ వెల్లడించారు. పోలీసు అధికారిణి వివరణ ప్రకారం.. బొయిపరిగుడ సమితి దశమంతపూర్ పంచాయతీ గాడపుట్ గ్రామానికి చెందిన సదన పంగి నెల రోజులుగా కుమార్తె నయన వద్ద ఉంటున్నాడు. బుధవారం రాత్రి ఎవరో దుండగులు అతడిని గొడ్డలితో నరికి హత్య చేసి బొదాపుట్ పంచాయతీ అమటిగుడ సమీప అడవిలో పారవేశారు.

ఈ విషయం గురువారం దెడాసూర్ గ్రామంలో గల బంధువు హరి హంతాల్ సదన కుమార్తె నయనకు కబురు చేశాడు. వెంటనే ఆమె బంధువులు, కుటుంబ సభ్యులతో వెళ్లి తండ్రి మృతదేహాన్ని చూసి విలపించింది. పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంటనే సంఘటనా ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. సదన్‌ను గొడ్డలితో నరికి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎందుకు, ఎవరు హత్య చేశారు అన్నది స్పష్టం కావటంలేదని పోలీసు అధికారి వెల్లడించారు. పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. వారికి బొదాపుట్ సర్పంచ్ జమున నాయిక్, దశమంతపూర్ సర్పంచ్ రోహిత్ కుమార్‌లు సహకరిస్తున్నారు. హంతకులను తప్పకుండా పట్టుకుంటామని పోలీసు అధికారి దీపాంజళి ప్రధాన్ వెల్లడించారు.



అడవిలో సదన మృత దేహం పడి ఉన్న పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న పోలీసులు

ప్రాణం తీసిన వేడుకలు..?

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితిలో నూతన సంవత్సరం సందర్భంగా జరుపుకున్న వేడుకలు ప్రాణం తీసినట్లు తెలుస్తోంది. హత్యకు గురైన యువకుడు బొరిగుమ్మ సమితి బిసింగపూర్ పోలీసుస్టేషన్ పరిధి నకులగుడ గ్రామానికి చెందిన జగన్నాథ మఝి(30)గా గుర్తించారు. సమాచారం అందిన వెంటనే బొరిగుమ్మ సబ్ డివిజన్ పోలీసు అధికారి తపస్వినీ కుహర్ క్లూస్ టీమ్‌తో ఘటన ప్రాంతానికి వెళ్లారు. పోలీసు స్టేషన్‌లో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

పోలీసులు వివరణ మేరకు..

పోలీసుల వివరణ ప్రకారం జగన్నాథ్ మఝి తన స్నేహితులతో కలిసి నకులపుట్ గ్రామ సమీపంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలకు వెళ్లాడు. అనంతరం ఇంటికి బయల్దేరాడు. అతను వస్తుండగా ఆ గ్రామ సమీపంలోని మరో ప్రాంతంలో మరి కొంతమంది సాయంత్రం వేడుకలు చేసుకుంటున్నారు. జగన్నాథ్ అక్కడికి వెళ్లగా అక్కడ కొంతమందితో గొడవ జరిగింది. కాగా ఆరాత్రి అతను ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెదికారు. అయితే గురువారం అతడి ఇంటి వెనుక ఉన్న కాయగూరల పొలం వద్ద రక్తపు మడుగులో జగన్నాథ్ పడి ఉండడం కనిపించింది. అయితే అప్పటికే అతడు మరణించాడు. ఈ విషయంపై జగన్నాథ్ తమ్ముడు దైతేరీ మఝి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రథమంగా జగన్నాథ్‌తో కలిసి ఉదయం వేడుకలు చేసుకున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని విడిచిపెట్టారు. తర్వాత సాయంత్రం వేడుకలు జరుపుకున్న వారిలో నలుగురుని స్టేషన్‌కు రప్పించి వారిని విచారిస్తున్నట్లు వెల్లడించారు. మృతదేహాన్ని హాస్పిటల్‌కు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. హంతకులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసు అధికారి వెల్లడించారు.



కాయగూరల తోటలో పడి ఉన్న మృతదేహం వద్ద పోలీసులు

క్లుప్తంగా

గంజాయి ధ్వంసం



గంజాయి మొక్కలను తగుల బెడుతున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంచకరడ, ఛుకురుకుడి ప్రాంతాల్లో అక్రమంగా సాగుచేస్తున్న గంజాయి వనాలను పోలీసులు శుక్రవారం దాడి చేసి ధ్వంసం చేశారు. సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో గల 21 వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేసిన అనంతరం వాటిని తగులబెట్టారు.

ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత



ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేస్తున్న అటవీ శాఖ సిబ్బంది



వ్యర్థాలను తరలిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: రాయఘడ బ్లాక్ కోయిపూర్ పంచాయతీలో ఉన్న పవిత్ర మహేంద్రగిరి పర్వతాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను అటవీ శాఖ సిబ్బంది, ఎకో డవలప్‌మెంట్ కమిటీ సభ్యులు కలిసి శుక్రవారం ఏరివేత కార్యక్రమం చేపట్టారు. మహేంద్రగిరి కుంతీ, యుధిస్టర, భీమ మందిరాల సమీపంలో పేరుకుపోయిన చెత్తను ఏరి ట్రక్కులో తరలించారు. కార్యక్రమంలో కోయిపూర్ అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు

సారవకోట: మండలంలోని టోల్‌గేట్ సమీపంలో శుక్రవారం ఎస్ఐ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఒడిశా నుంచి ఆంధ్రాలోని పలు ప్రాంతాలకు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు రవాణా అరికట్టేందుకు పాతపట్నం నుంచి వచ్చే ట్రావెల్స్ బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లగేజీ ఆటో బోల్తా

బూర్జ: మండలంలోని ఎ.పి.పేట పంచాయతీ బూర్జమానుగూడ నుంచి గోపిదేవిపేట గిరిజన గ్రామానికి వెళ్తున్న లగేజి ఆటో శుక్రవారం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో తేజేశ్వరరావు, సవర బోడెమ్మ, సవర చందు, సవర బాలకృష్ణకు గాయాలు కావడంతో 108 అంబులెన్సులో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసుస్టేషన్ హెచ్‌సీ పి.వి.రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జానపద గీతాలాపనలో శిరీష ప్రతిభ

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఇంజినీరింగ్ రెండో ఏడాది విద్యార్థిని సూర్నీడి శిరీష జానపద గీతాలాపనలో ప్రతిభ కనబరిచింది. రాష్ట్రస్థాయి యూత్ అఫైర్స్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో జానపద గీతాల విభాగంలో మొదటి బహుమతి సాధించింది. త్వరలో న్యూఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా శిరీషను డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కె.మోహన్‌కృష్ణ శుక్రవారం అభినందించారు. జాతీయ స్థాయిలోనూ సత్తాచాటాలని ఆకాంక్షించారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు కేశవరావుపేట విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూజారి హర్ష అభిరామ్, కొత్తకోట వసంత ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని జలగాన్‌లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి. విద్యార్థులను డీఈవో తిరుమల చైతన్య, హెచ్ఎం సాయిరాం, పీడీ ఎంవీ రమణ, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

900 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

మెళియాపుట్టి: గిరిజన గ్రామాల్లో నాటు సారా స్థావరాలపై దాడులు ముమ్మరం చేస్తున్నట్లు టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్ తెలిపారు. శుక్రవారం మెళియాపుట్టి మండలం బాణాపురం పంచాయతీ ఎగువబగడ గ్రామంలో దాడులు నిర్వహించి 900 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. 10 లీటర్ల సారా, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో టెక్కలి ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రేక్షకులతో సహా ఆనందిస్తున్న కలెక్టర్ పట్వారి, ఎస్పీ శ్వాతి ఎస్ కుమార్



కళాకారిణి



గాయకుడు



గాయకుల బృందం



పాటలు పాడుతున్న ఆసీమా పండ

పారిశ్రామిక హబ్‌గా రాయగడ

● చైతీ ఉత్సవాల్లో పారిశ్రామిక వేత్తలు

రాయగడ: అపారమైన ఖనిజ సంపదలు గల రాయగడ జిల్లా రానున్న రోజుల్లో పారిశ్రామిక హబ్‌గా మారనుందని పారిశ్రామిక ప్రముఖులు అన్నారు. స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న చైతీ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉత్సవాలకు హాజరైన మైత్రీ ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఎస్.సత్యనారాయణ, జేకేపేపర్ మిల్ ఉపాధ్యక్షులు వినయ్ ద్వివేది, ఉత్కళ అలూమిన ప్రాజెక్టు హెడ్ రవినారాయణ మిశ్రా, సీఈవో మజార్ బేగ్, ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రో ఎల్లోయిస్ ఉపాధ్యక్షులు ఆశీష్ కుమార్ రాయ్, ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ రీజనల్ మేనేజరు కథి ప్రాధాన్‌లు మాట్లాడుతూ.. జిల్లాలో విరివిగా లభిస్తున్న బాక్షయిట్ నిక్షేపాలు పారిశ్రామిక ప్రగతికి సంకేతాలని అన్నారు. వీటిని సద్వినియోగపరుచుకునేందుకు దేశం నలుమూలల నుంచి ఎన్నో పరిశ్రమలు ఇక్కడకు వస్తున్నాయని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుతో ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగు పడటంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని అన్నారు. రానున్న రోజుల్లో రాయగడ జిల్లా దేశ చిత్ర పటంలో ప్రత్యేక గుర్తింపు పొందే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ప్రసంగిస్తున్న కలెక్టర్ పట్వారి



పారిశ్రామిక దిగ్గజాలకు సన్మానిస్తున్న కలెక్టర్ పట్వారి

ప్రతిభను వెలికితీయడమే ఉత్సవాల లక్ష్యం

జిల్లాలోని ఎంతో మంది కళాకారులు, వివిధ రంగాల్లో ప్రతిభావంతులు ఉన్నారని.. అటువంటి వారిని ప్రోత్సాహించేందుకు ఈ ఉత్సవాలు ఎంతో దోహదపడతాయన్న ఉద్దేశ్యంతోనే ఏటా చైతీ పేరిట ఉత్సవాలను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి అన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆమె ప్రసంగిస్తూ ఈ జిల్లాలో నిరుద్యోగ సమస్యను తొలగించేందుకు పరిశ్రమలు ఎంతో కృషి చేస్తున్నాయని అన్నారు. పరిశ్రమల ఏర్పాటుతోనే ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని ఆదివాసీ సంస్కృతికి ప్రతిబింబించే విధంగా వారి కళలను పరిరక్షించే విధంగా ఈ చైతీ ఉత్సవాలు ఒక వేదికగా మారడం అభినందనీయమన్నారు. స్థానిక కళాకారులకు ప్రోత్సాహించేందుకు ఈసారి చైతీ వేదిక సన్నాహాలు చేసిందని అన్నారు. కాగా చైతీ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా ఓలీవుడ్ చలనచిత్ర నేపథ్య గాయని ఆసీమా పండ బృందం ఆలపించిన గీతాలు ఆహూతులను ఉర్రూతలూగించాయి.



ప్రేక్షకుల మధ్య గాయకుడు

ప్రేమ పేరుతో మోసం

జయపురం: ప్రేమిస్తున్నట్లు నమ్మించి సచివాలయంలో టెండర్ ఇప్పిస్తానని ఆశ చూపి ఆమె నుంచి రూ.9 లక్షలు స్వాహా చేసి పరారైన మోసగాడిని భువనేశ్వర్‌లో అరెస్టు చేసినట్లు పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొలాయి శుక్రవారం వెల్లడించారు. నిందితుడు భువనేశ్వర్ నయాపల్లి ప్రాంతానికి చెందిన తపన కుమార్ దాస్(38)అని వెల్లడించారు. అతడిపై రాజధానిలో అనేక కేసులు ఉన్నట్లు తెలిపారు. పోలీసు అధికారి వివరణ ప్రకారం జయపురంలో ఒక వీధిలో వితంతు యువతి ఉంటున్నారు. గత ఏడాది సోషల్ మీడియా ద్వారా వీరిద్దరికీ పరిచయం ఏర్పడింది. తాను ఒక పెద్ద వ్యాపారినని కుమార్ పరిచయం చేసుకున్నాడు. అక్కడి నుంచి ఇద్దరూ చాటింగ్ చేసుకోవడం ప్రారంభించారు. ఆమెకు భర్త లేకపోవటం వల్ల అవకాశంగా చేసుకున్నాడు. తాను వివాహం చేసుకుంటానని, అంతకంటే ముందు వ్యాపారం విస్తరిస్తానని, అందుకోసం టెండర్ వేయాలని నమ్మ బలికాడు. అలా సచివాలయ అధికారిగా మరొకరితో ఫోన్ చేయించాడు. టెండర్ వేయడానికి డబ్బులు కావాలని చెప్పి ఆమె నుంచి రూ.9లక్షలు కాజేశాడు. తర్వాత అతను కనిపించలేదు. తాను మోసపోయానని తెలుసుకున్న యువతి జయపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 2024 అక్టోబర్ 4న కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తపన్ అప్పటికే పరారైపోగా ఎస్ఐ సిద్దాంత కుమార్ బెహర నేతృత్వంలో ఒక పోలీసు టీమ్ భువనేశ్వర్ వెళ్లింది. అక్కడ దర్యాప్తులో పలు ఆధారాలు సేకరించి నయాపల్లి పోలీసుల సహకారంతో నిందితుడిని పట్టుకున్నారు. ఇలా మోసం చేయడం తపన్‌కు అలవాటేనని పోలీసులు తెలిపారు. అతడిని కోర్టులో హాజరు పరిచామని, కోర్టు బైలు నిరాకరించగా అతడు జైలుకు వెళ్లాడని పోలీసు అధికారి తెలియజేశారు.



అరెస్టు అయిన నిందితుడు తపన్ కుమార్ దాస్

● గవర్నర్‌తో గజపతి ఎమ్మెల్యేలు



గవర్నర్‌తో దిగపహండి ఎమ్మెల్యే సిద్ధాంత మహాపాత్రో, దాశరథి గోమాంగో తదితరులు



రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కె.హరిబాబును కలిసిన ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: కొత్త గవర్నర్ కంభంపాటి హరిబాబును పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి రాజభవన్‌లో కలిశారు. ఆయనతో పాటు బరంపురం ఎంపీ డాక్టర్ ప్రదీప్ పాణిగ్రాహి, మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, దిగపహండి ఎమ్మెల్యే సిద్ధాంత మహాపాత్రో తదితరులు ఉన్నారు.

9 ప్రతిపాదనలకు ఆమోదం

● రాష్ట్ర మంత్రి వర్గం తీర్మానాలు
● సుభద్ర పథకం దరఖాస్తు గడువు పొడిగింపు
● సాంఘిక భద్రత పింఛన్ పెంపు

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ అధ్యక్షతన శుక్ర వారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వివిధ శాఖలు ప్రతిపాదించిన 9 ముఖ్యమైన అంశాలపై ప్రధానంగా చర్చించి ఆమోదించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఆకర్షణీయ పథకం సుభద్ర యోజన దరఖాస్తు గడువు పొడిగించేందుకు ఆమోదించడం విశేషం. మంత్రి మండలి నిర్ణయం ప్రకారం సుభద్ర యోజన లబ్ధి కోసం దరఖాస్తు దాఖలు గడువుని ఈ ఏడాది మార్చి 31 వరకు పొడిగించారు. ఈ వ్యవధిలో దరఖాస్తు చేసుకుంటే ఇప్పటి వరకు విడుదల చేసిన 2 వాయిదాల మొత్తం ఒక్క విడతలో తాజా దరఖాస్తుదారుల ఖాతాకు నగదు ప్రత్యక్షంగా బదిలీ చేస్తారు.

పింఛను పెంపు

సాంఘిక భద్రత కింద మంజూరు చేస్తున్న వయో వృద్ధులు, దివ్యాంగుల ఫింఛను పెంచేందుకు కేబినెట్ అంగీకరించింది. మధు బాబు ఫించను పథకం మరియు జాతీయ జాతీయ సామాజిక భద్రతా కార్యక్రమం రెండింటి కింద 80 సంవత్సరాలు, అంతకంటే పైబడిన వయో వృద్ధులకు, 80 శాతం పైబడి వైకల్యం కలిగిన దివ్యాంగులకు నెలసరి ఫించను రూ. 3,500కి పెంచారు. ఈ పెంపు ఈ ఏడాది జనవరి 2025 నుంచి అమలులోకి వస్తుందని మంత్రి మండలి ప్రకటించింది. వ్యవసాయ పారిశ్రామికవేత్తలకు ఉపాధి, రుణాలు అందించడానికి రానున్న 5 ఏళ్లకు రూ.874.14 కోట్ల వ్యయ ప్రణాళిక ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదించిందని ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా తెలిపారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ. 30 వేలు సబ్సిడీ ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద మరో రూ. 25 వేలు అదనంగా సబ్సిడీ ఇవ్వాలని రాష్ట్ర మంత్రివర్గం సమావేశంలో నిర్ణయించారు. ఇది కాకుండా, ఒడిశా స్టేట్ సప్లై కార్పొరేషన్ యొక్క బ్యాంకు రుణాలకు ప్రభుత్వ గ్యారంటీ విధానాన్ని అమలు చేసే ప్రతిపాదన కూడా ఆమోదించారు.

బైక్ ప్రమాదంలో యువకుడు మృతి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి నీలాకాంబరు పంచాయతీ సుర్లుకొండ గ్రామ సమీపంలో బైక్ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. బలిమెల ఎన్‌పీసీ 12వ వార్డులో నివాసం ఉంటున్న విజయ్ దాస్ (23) తన మేనమామ ఇంటి నుంచి గురువారం సాయంత్రం బయల్దేరాడు. తాండికొండ గ్రామం వద్దకు వచ్చే సరికి బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో రక్తస్రావమై స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో స్థానికులు వెంటనే బలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. బలిమెల పోలీస్‌స్టేషన్ ఐఐసీధీరజ్ పట్నాయిక్ బలిమెల ఆరోగ్య కేంద్రానికి వెళ్లి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.



బలిమెల ఆరోగ్య కేంద్రం వద్ద విజయ్ మృతదేహం

రోడ్డు నిబంధనలు పాటించాలి

పర్లాకిమిడి: రోడ్డు నిబంధనలు పాటించాలని అధికారులు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా పర్లాకిమిడిలో ప్రాంతీయ రోడ్డు రవాణా సంస్థ కార్యాలయం నుంచి చైతన్య ర్యాలీని ఆర్టీవో ప్రసన్న కుమార్ దాస్ శుక్రవారం ప్రారంభించారు. ర్యాలీలో వివిధ పాఠశాలల విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టుకుని నినాదాలు చేశారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మొబైల్‌లో మాట్లాడుతూ, మద్యత తాగి వాహనాలు నడపరాదని, సీటు బెల్టు పెట్టుకుని కారు డ్రైవింగ్ చేయాలని నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. ర్యాలీ హైస్కూల్ జంక్షన్, మార్కెట్, పాతబస్టాండు, కొత్తబస్టాండు మీదుగా రాజవీధి, కలెక్టరేట్ వరకు సాగింది. ర్యాలీలో రోడ్డు రవాణా సంస్థ ఇన్‌స్పెక్టర్ తుషార్ హెంబ్రం, పోలీసు విభాగం ఐఐసీ ప్రశాంత భూపతి, ఎస్‌డీపీవో మాధవానంద నాయక్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



మాస్కట్‌లతో రోడ్డు భద్రతా వారోత్సవాల ర్యాలీ



గజపతి కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ



ర్యాలీలో విద్యార్థులు

సృజనాత్మకతకు సలాం



రాష్ట్రపోటీలకు ఎంపికైన వివిధ ప్రాజెక్టుల విద్యార్థులు, టీచర్లతో విద్యాశాఖాధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకను ఉపాధ్యాయులే గుర్తించి, వారిని ప్రోత్సహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనను జేసీ ప్రారంభించారు. జిల్లాలోని వివిధ యాజమాన్యాల ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రాజెక్టులతో అబ్బురపర్చారు. డిసెంబర్ 30న జిల్లా వ్యాప్తంగా మండలస్థాయిలో విద్యార్థి, విద్యార్థుల గ్రూపు, టీచర్ కేటగిరీల్లో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రాజెక్టులు జిల్లా పోటీల్లో పాల్గొన్నాయి. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులతో కలిసి పోటీలను, విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 916 ప్రాజెక్టులు మండలస్థాయి పోటీల్లో రూపొందించారని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. వీటిల్లో ఉత్తమమైన ప్రాజెక్టులను మండలస్థాయిలో ఎంపిక చేయగా అందులో 93 ప్రాజెక్టులను జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు వివరించారు.

ఆరు ప్రాజెక్టులు రాష్ట్రపోటీలకు ఎంపిక..

ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనల్లో విద్యార్థులు ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జ్యూరీ సెలక్షన్ కమిటీ ఫైనల్‌గా ఎంపికచేసిన 6 ప్రాజెక్టులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రాజెక్ట్ నోడల్ అధికారి, ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి తెలిపారు. విజయవాడ వేదికగా ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రపోటీలు జరుగుతాయని చెప్పారు. విజేతలకు సుడా చైర్మన్ కొరకాన రవికుమార్, డీఈఓ తిరుమల చైతన్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ సంపతిరావు శశిభూషణ్, జిల్లా సైన్స్ అధికారి ఎస్.కుమారస్వామి, అసిస్టెంట్ కమిషనర్ లియాఖాత్ ఆలీఖాన్, డీవైఈఓ విలియమ్స్, పేడాడ దాలినాయుడు, హెచ్ఎంలు, సైన్స్ టీచర్లు, జ్యూరీ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

పునరుత్పాదక బ్రేకుల వ్యవస్థ..



పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జశ్వంత్ పాత్రో 'పునరుత్పాదక బ్రేకుల వ్యవస్థ' పేరిట ప్రాజెక్టును తీర్చిదిద్దాడు. ఫిజికల్ సైన్స్ టీచర్ జె.షణ్ముఖరావు గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. మెకానికల్ ఎనర్జీని ఎలక్ట్రిక్ ఎనర్జీగా ఈ ప్రాజెక్టుతో కన్వెర్ట్ చేయవచ్చు. విద్యుత్ నిల్వ కావడంతోపాటు ఖర్చు, కాలం ఆదా అవుతుందని, గ్లోబల్ వార్మింగ్ తగ్గుతుందని నిరూపించిన ఈ ప్రాజెక్ట్ 'స్టూడెంట్ వ్యక్తిగత విభాగం'లో మొదటిస్థానంలో నిలిచి రాష్ట్రపోటీలకు ఎంపికైంది.

లిక్విడ్-3(ట్రీ)తో పర్యావరణ హితం..



పురుషోత్తపురం ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి పాండవ దీపక్‌కుమార్ లిక్విడ్-3 పేరిట లిక్విడ్ ట్రీ ప్రాజెక్టును సన్నద్ధంచేశాడు. ఫిజికల్ సైన్స్ టీచర్ పి.వెంకటరావు గైడ్‌గా వ్యవహరించారు. ద్రవం చెట్టుగా ఉండేలా మైక్రో యాల్గి(నాచు) టెక్నాలజీని వాడి రూపొందించారు. అర్బన్ పరిధిలో ఈ చెట్లు అధికంగా ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. దీనివల్ల కాలుష్యం తగ్గుతుంది. పర్యావరణం మెరుగుపడుతుందని నిరూపించిన ఈ ప్రాజెక్ట్ 'స్టూడెంట్ వ్యక్తిగత విభాగం'లో రెండో స్థానంలో నిలిచి రాష్ట్రపోటీలకు ఎంపికైంది.

పింఛన్..వంచన..!

- కొత్త పింఛన్ల కోసం లబ్ధిదారుల ఎదురుచూపు
- వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు తప్పని ఇబ్బందులు
- గత ఎనిమిదినెలలుగా పింఛన్ మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- జిల్లా వ్యాప్తంగా 8600కు పైగా దరఖాస్తులు
- ఇటీవల సదరం కేంద్రాల నిలుపుదల
- అడ్రస్‌లేని 50 ఏళ్లకే ఫించన్ పథకం
- బిత్తరపోతున్న లబ్ధిదారులు
- స్పౌజ్‌కోటాలో కేవలం 292 పింఛన్లు మాత్రమే మంజూరు



రాజాం: ఈ ఫొటోలోని మహిళ పేరు సీరాపు గౌరమ్మ. వంగర మండలం పట్టువర్ధనం గ్రామం. ఈమె భర్త సీరాపు సింహాచలం సరిగ్గా పదినెలల క్రితం మృతిచెందాడు. వితంతు పింఛన్ నిమిత్తం ఆమె అప్పట్లో గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఆరునెలలకు ఒక దఫా కొత్త పింఛన్లు, సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపికచేసి, సకాలంలో అందించేది. కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో పాటు గత ఎనిమిదినెలలుగా కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో ఈమెకు పింఛన్ అందలేదు. దీంతో ఆమె కుటుంబాన్ని నెట్టుకొచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతోంది. మగదిక్కులేని ఈ కుటుంబానికి ఆసరా కల్పించాల్సిన పింఛన్ అందకపోవడం శోచనీయంగా మారింది.



ఈ ఫొటోలోని మహిళ పేరు కొర్ను రాజులమ్మ. రాజాం మండలం నంద బలగ రామం. ఆమె భర్త కొర్ను లింగమూర్తి మే నెలలో మృతిచెందాడు. రోజువారీ కష్టంతో లింగమూర్తి కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. ఆయన మరణాంతరం కుటుంబం రోడ్డున పడింది. రాజులమ్మ పింఛన్ కోసం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంది. ఇంతవరకూ పింఛన్ మంజూరు కాలేదు. గతంలో ఠంచన్‌గా ప్రతి ఆరునెలలకు కొత్త లబ్ధిదారులను గుర్తించి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పింఛన్ అందించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనుమరుగైంది.

జిల్లా వ్యాప్తంగా 8వేలకు పైగా దరఖాస్తులు

గత తొమ్మిదినెలల నుంచి జిల్లా వ్యాప్తంగా 8వేలకు పైగా కొత్త పింఛన్లకు లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులు గ్రామ సచివాలయాల వద్ద ఎదురుచూస్తున్నాయి. వితంతు పింఛన్లతో పాటు వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్ నిమిత్తం సచివాలయాలకు దరఖాస్తులు ఇవ్వడమే తప్ప కొత్త పింఛన్ల మంజూరు, పరిశీలన వంటి కార్యక్రమాలు ఇంతవరకూ ప్రారంభం కాలేదు. వీటికి తోడు కొత్తగా నమోదైన కిడ్నీ, లివర్, హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్, డయాలసిస్, సికిల్‌సెల్, ఒంటరి మహిళ, లెప్రసీ, కండరాల బలహీనత వ్యాధిగ్రస్తులు పింఛన్ల నిమిత్తం ఎదురుచూస్తున్నారు వీటితో వచ్చే నగదుతో మందులు కొనుగోలుచేసి, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం సామాజిక పింఛన్ల మంజూరుకు ఎటువంటి కనికరం చూపించకపోవడం శోచనీయం



రాజాంలో ఖాళీగా సదరం కేంద్రం

సదరం మూసివేత

గతంలో సదరం సర్టిఫికెట్ల మంజూరు కేంద్రాలు నిరంతరం పనిచేసేవి. ప్రతి మంగళ, శుక్రవారాల్లో పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సదరం తనిఖీలు చేసేవారు. ప్రమాదాలు, పక్షవాతం బారిన పడి అంగవైకల్యంతో ఇబ్బందిపడేవారికి సదరం కేంద్రాల్లో తనిఖీ అనంతరం సర్టిఫికెట్లు మంజూరయ్యేవి. వారికి సామాజిక పింఛన్లు మంజూరుతో పాటు పలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిచేకూరేది. ఇప్పుడు ఆ పరిస్థితి తలకిందులుగా మారింది. కొంతకాలంగా సదరం స్లాట్ బుకింగ్‌లతో పాటు సర్టిఫికెట్ల మంజూరును కూడా కూటమి ప్రభుత్వం నిలుపుదల చేసేసింది.

అటకెక్కిన 50 ఏళ్లకే పింఛన్

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 50 ఏళ్లు నిండిన వారందరికీ సామాజిక పింఛన్లు ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఇంతవరకూ ఆ పథకం అమలుకాలేదు. 50 ఏళ్లుదాటితే పింఛన్ వస్తుందని ఎదురుచూడడంతోపాటు ఏ క్షణాన్నైనా పింఛన్ మంజూరవుతుందనే ఆశతో పలువురు లబ్ధిదారులు ఇప్పటికే గ్రామ సచివాలయాల్లో కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డులతో దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులు కూడా ఆయా గ్రామాల టీడీపీ కార్యకర్తలు కలెక్షన్ చేయగా, ఇంతవరకూ పింఛన్ల మంజూరుకు కనీసం దరఖాస్తులు కూడా తీసుకోకపోవడం కొసమెరుపు.

కేవలం నామినీలకే..

జిల్లాలో 8600 మందికి పైగా కొత్త పింఛన్ దరఖాస్తు దారులు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో కేవలం 292 మందికి మాత్రమే స్పౌజ్(నామినీ) కోటాలో జనవరి నెలలో కొత్త పింఛన్ అందించింది. అవి కూడా జిల్లాలో పలుచోట్ల అర్హులకు అందలేదనే విమర్శలు ఉన్నాయి. కేవలం టీడీపీ అనుకూల వర్గీయులకు మంజూరు కావడం, పలుచోట్ల కొత్తగా పింఛన్ వచ్చినవారిని టీడీపీ కార్యకర్తలు ప్రలోభాలకు గురిచేయడం, ఆయా గ్రామాల్లో గ్రామ సచివాలయ సిబ్బంది ఎటువంటి పదవులు లేని టీడీపీ కార్యకర్తలతో పింఛన్లు పంపిణీచేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయంపై రాజాం ఎంపీడీఓ వి. శ్రీనివాసరావు వద్ద సాక్షి ప్రస్తావించగా కొత్త పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియ ఎక్కడా ప్రారంభంకాలేదన్నారు. కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి విధివిధానాలు కూడా ఖరారుకాలేదని వెల్లడించారు.

అంతా బూటకమే



అబద్ధపు హామీలతో కూటమి ప్రభుత్వం గద్దెనెక్కింది. ప్రధానంగా సూపర్ సిక్స్ పథకాలేవీ అమలు కావడంలేదు. వాటి పరిస్థితి పక్కన పెడితే కనీసం పింఛన్ల మంజూరు విషయంలో కూడా ఈ ప్రభుత్వం చొరవచూపకపోవడం శోచనీయం. జిల్లాలో కుప్పలుతెప్పలుగా కొత్త పింఛన్ల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుని సిద్ధంగా ఉన్నారు. ఇంతవరకూ వారికి పింఛన్లు ఇవ్వకపోగా, గత పాత పింఛన్లను కత్తిరించేందుకు కూటమి ఆలోచన చేస్తోంది.

బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎంపీ, విజయనగరం

క్లుప్తంగా

5నుంచి ఎంజేపీ స్కూల్‌లో క్రీడాపోటీలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేవీబీ రావు

నెల్లిమర్ల: ఈనెల 5వతేదీనుంచి ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాలలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేవీబీ రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యా సంస్థ,(విజయవాడ) ఆధ్వర్యంలో జోన్-1 ఆటలు పోటీలు ఈనెల 5,6తేదీల్లో నెల్లిమర్ల ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అలాగే జోన్-1లో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 14 విద్యాసంస్థలకు చెందిన బాలికలు వాలీబాల్, కబడ్డీ, షటిల్, పరుగుపందెం తదితర విభాగాల్లో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కరాటే పోటీల్లో విజయనగరం క్రీడాకారులకు పతకాలు



కరాటే పోటీల్లో సాధించిన పతకాలతో క్రీడాకారులు

విజయనగరం: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఖరగ్‌పూర్‌లో జరిగిన జపాన్ కెన్యూర్యూ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్-24లో విజయనగరం పట్టణంలోని కొత్త అగ్రహారంలో ఉన్న గురుదత్త పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులకు పతకాలు లభించాయి. ఈ మేరకు కరాటే కోచ్ కె.సంతోష్ కుమార్ శుక్రవారం విడుదల చేసిన ప్రకట నలో విద్యార్థులు పి.హేమంత్ (రెండు బంగారు), కె.శివగణేష్ (ఒక బంగారు, ఒక కాంస్య పతకం), బి.రేశ్వంత్ (కాంస్య) పతకాలతో విజయ భేరి మోగించినట్లు తెలిపారు. కోచ్ సంతోష్ కుమార్‌తో పాటు విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ పద్మ, శంకరరావు తదితరులు అభినందించారు. మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు.

అమ్మవారి హుండీల ఆదాయం రూ.4,47,668



అమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న అధికారులు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో హుండీల ద్వారా రూ.4,47,668 ఆదాయం లభించినట్లు దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జి.శ్యామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో హుండీల ఆదాయం లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. 2024 సెప్టెంబర్ 9 నుంచి 2025 జనవరి 3 వరకు భక్తులు హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించారు.

125 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

బొబ్బిలి: పట్టణ సమీపంలోని గ్రోత్ సెంటర్ వద్ద 125 మద్యం సీసాలను తరలిస్తున్న గున్నతోట వలసకు చెందిన పప్పల రాధాకృష్ణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు ఏఎస్సై జి.భాస్కర రావు తెలిపారు. పారాది నుంచి గున్నతోట వలస వెళ్తున్న రాధాకృష్ణ వద్ద మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం తరలించామన్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా



ప్రమాదంలో బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

మెంటాడ: మండలంలోని గుర్రమ్మవలస -బుచ్చిరాజుపేట గ్రామాల మధ్య ఆర్టీసీ పల్లె వెలుగు అద్దె బస్సు పొలాల్లో శుక్రవారం బోల్తా పడింది. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి జక్కువ వెళ్తున్న బస్సు ప్రమాదవశాత్తు రెండు గ్రామాల మధ్య బోల్తా పడింది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఆరుగురు ప్రమాణికులు మాత్రమే ఉన్నారు. ప్రయాణికులను సురక్షితంగా స్థానికులు బస్సు అద్దాలు పగులగొట్టి బయటకు తీశారు. ప్రయాణికులు ఆరుగురికి స్వల్ప గాయాలు కావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. గాయపడిన వారిని చల్లపేట పీహెచ్‌సీకి వైద్యం కోసం తరలించారు. ఆంధ్ర ఎస్సై కె.సీతారాం సంఘనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి



మహాసభల కరపత్రాలను విడుదలచేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాస భలు ఫిబ్రవరి 6,7,8,9 తేదీలలో శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా జరుగుతున్నాయని, వాటిని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బూర వాసు, కోట అప్పన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక అమర్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం, పాలక పక్షాలు విఫలమయ్యాయని విమర్శించారు. భారతదేశంలో యువకులు పెద్ద ఎత్తున ఉన్నప్పటికీ వారికి కల్పించవలసిన హక్కులను నిర్వీర్యం చేశారని విమర్శించారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగినప్పటికీ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఈ తరుణంలో శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా జరుగుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 22వ మహాసభల లో 6వ తేదీ ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని వారు కోరారు. 7,8 వ తేదీలలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే 1000 మంది ప్రతినిధులతో మూడు రోజులపాటు దేశం, రాష్ట్రంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించుకుని యువతను మమేకం చేసి భవిష్యత్తు ఉద్యమాలకు నాంది పలుకుతామన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఎస్ గౌరీశంకర్, సీహెచ్ వెంకటేష్, ఎం.సుధాకర్, ఎస్.మహేష్ పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



పోలీసు సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్: నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై ఉండే పోలీస్ సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ.మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 'పోలీస్ వెల్ఫేర్ డే' (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ముఖ్య ప్రాధాన్యం ఇస్తూ సిబ్బంది వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన పలు సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ గ్రీవెన్స్‌డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొని వారికి ఉన్న సమస్యలను ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. పోలీస్ సిబ్బంది విన్నవించుకున్న సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని ఎస్పీ భరోసా కల్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో ఎస్పీ మాట్లాడి, పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీసీ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

పర్యాటకరంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



తాటిపూడి రిజర్వాయర్‌లో పర్యాటక అభివృద్ధిలో భాగంగా సాహస జలక్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గంట్యాడ: పర్యాటకరంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గంట్యాడ మండలంలోని తాటిపూడిలో ఉన్న గొర్రిపాటి బుచ్చిఅప్పారావు జలాశయం వద్ద వాటర్‌స్పోర్ట్స్ సింపల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేసిన అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోటు షికారు ఉంటే పర్యాటకులు ఎక్కువగా వస్తారన్నారు. కోవిడ్ తర్వాత కుటుంబ సభ్యులతో గడపడానికి ఎక్కువ మందికి ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలసయశస్వి, వాటర్ స్పోర్ట్స్ సీఈఓ పాపారావు, మర్రాపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకంగా ఆలోచించాలి..

భోగాపురం: ప్రతి విద్యార్థీ సృజనాత్మకంగా ఆలోచించాలని భీమిలి ఉమెన్ పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మురళీకృష్ణ, స్కిల్ డవలప్‌మెంట్ జిల్లా అధికారి జి. ప్రశాంత్‌కుమార్ అన్నారు. మండలంలోని కవులవాడ అవంతి పాలిటెక్నికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్. మల్లేశం దొర ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన టెక్ ఉత్సవ్ 2కె25 కనెక్టింగ్ విత్ ఫ్యూచర్ అవగాహన సదస్సును వారు ప్రారంభించారు. ఈ సదస్సుకు ఉత్తరాంధ్ర పరిధిలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొని పలు ప్రాజెక్ట్‌లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ప్రాథమిక దశలో ఇటువంటి వైజ్ఞానిక సదస్సులు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. పిల్లల్లో ఇమిడి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను ఇటువంటి సదస్సుల ద్వారా వెలికితీయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి. గోవింద్, శెట్టి మహేష్, ఎ.చంద్రశేఖర్, కె.భాస్కరరావు, జి. అశోక్ కుమార్, కె.హేమ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సూర్యఘర్'పై అవగాహన పెంపొందించండి

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్యఘర్ పథకం విశిష్టతను ప్రతి ఒక్కరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ కార్యదర్శులకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాల వివరాల నమోదును ఈనెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని చెప్పారు. అలాగే సూర్యఘర్ పథకం ఆవశ్యకతను అపార్ట్‌మెంట్ అసోసియేషన్లతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 20వ తేదీలోగా సమావేశాలు పూర్తి చేయాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, హాస్పటళ్లు, హోటళ్లు వంటి సంస్థలలో సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి గృహ సముదాయంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారా, లేదా అన్నది తనిఖీలు నిర్వహించాలన్నారు. త్వరలోనే ఎన్టీఆర్ భరోసా దివ్యాంగ పెన్షన్లను తనిఖీ చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో టీపీఆర్ఓ సింహాచలం పాల్గొన్నారు.

6 నుంచి మెడికల్ పెన్షన్ల రీ వెరిఫికేషన్

- కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: మెడికల్ పెన్షన్ల రీ-వెరిఫికేషన్ ప్రక్రియను ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ తెలిపారు. ఈ ప్రక్రియపై జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, వైద్యాధికారులతో శుక్రవారం సాయంత్రం కలెక్టర్..తన చాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వైద్య పింఛన్లలో పూర్తిగా మంచానికే పరిమితమై పింఛన్ పొందుతున్న వారు 342 మంది ఉన్నారని తొలి విడతలో వీరి పింఛన్లను రీ వెరిఫికేషన్ చేయనున్నట్లు తెలిపారు. తరువాత దశలో మిగిలిన వైద్య పింఛన్లను పరిశీలిస్తారన్నారు. రీ వెరిఫికేషన్‌కు ఇతర జిల్లాల నుంచి 6 బృందాలు వస్తాయని చెప్పారు. ఒక్కో బృందంలో ఒక అర్థోపెడిక్ డాక్టర్, ఒక జనరల్ మెడిసన్ సర్టిఫికెట్, సదరం, ఆధార్ తదితర ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. వరుసగా మూడు రోజుల పాటు ఈ బృందాలు పర్యటిస్తాయని మూడు రోజుల విరామం తీసుకుంటాయని చెప్పారు. వీరి తనిఖీలకు వీలుగా షెడ్యూల్‌ను రూపొందించాలని ఆదేశించారు. సంక్రాంతి పండగకు ముందే వీలైనంత ఎక్కువమందిని తనిఖీ చేసేలా చూడాలని సూచించారు. పింఛన్‌దారుల అర్హతలను, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించడానికి మాత్రమే ప్రభుత్వం ఈ ప్రక్రియను చేపడుతోందని అర్హుల పింఛన్లు తొలగించే ఉద్దేశం ఎంతమాత్రం ప్రభుత్వానికి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ్ చక్రవర్తి, జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ, ఈపీఓ టి.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు, డీటీసీ డాక్టర్ కె.రాణి, ఆర్‌బీఎస్‌కే డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల పంటల ధ్వంసం

- ఏనుగులను తిప్పి పంపుతున్న ఒడిశా అధికారులు

భామిని: మండలంలోని వంశధార నదీ తీరంలో ఏనుగుల గుంపు విచ్చల విడిగా పంటలు ధ్వంసం చేస్తుంటే ఫారెస్టు అధికారులు చోద్యం చూస్తున్నారు. శుక్రవారం మండలంలోని పసుకుడి,భామిని గ్రామాలకు చెందిన కూరగాయల పంటలను నాలుగు ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. వంశధార నదీ తీరంలోని ఒడిశా గ్రామాలకు ఏనుగుల గుంపు వెళ్తున్నప్పటికీ ఒడిశా ఫారెస్టు అధికారులు గ్రామాల్లో విద్యుత్తును నిలిపివేసి ఏనుగుల గుంపును తిరిగి ఆంధ్రా గ్రామాలకు తరలిస్తున్నారు. దీంతో ఒడిశా గ్రామాల్లో ప్రవేశిస్తున్నప్పటికీ ఏనుగులను తిరిగి పంపిస్తున్నారని తీర ప్రాంత గ్రామ రైతులు వాపోతున్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ప్రారంభం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారి

బలిజిపేట: చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న మహిళా సంఘాల సభ్యులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వెలుగు శిక్షణ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధిశాఖ అధికారి కె. సాయికృష్ణ చైతన్య శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరంలో కొత్తగా రుణాలు పొందాలనుకునే వారు వారు చేపట్టాల్సిన, చేపడుతున్న వ్యాపారాల అభివృద్ధిని కొనసాగించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి మహిళ పారిశ్రామిక వేత్తగా తయారవాలనే ఉద్దేశంతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి వారికి తగు సూచనలు అందించనున్నట్లు తెలిపారు. వ్యాపారాన్ని నిర్వహించేందుకు అవసరమైన పెట్టుబడి ఒక రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు కొత్త రుణాలను ప్రభుత్వం ఇవ్వనుందని తెలిపారు. వాటితో ఎటువంటి వ్యాపారాలను నిర్వహించాలి, వాటికి అవసరమైన ప్రణాళికలు ఏ విధంగా సిద్ధం చేసుకోవాలనే దానిపై శిక్షణ ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఉమామహేశ్వరరావు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి 25 ఏళ్ల జైలు

- ఎస్పీ వకుల్ జిందల్




సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని రామభద్రపురం పోలీస్‌స్టేషన్‌లో 2024లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు జన్నివలస పంచాయతీ, నేరెళ్ల వలస గ్రామానికి చెందిన 40 ఏళ్ల బోయిన ఎరుకన్న దొరకు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ వకుల్ జిందల్ ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఎస్పీ వెల్లడించిన కేసు వివరాలిలా ఉన్నాయి. 2024 జూలై 13న వరసకు కుమార్తె అయిన ఫిర్యాది ఇంట్లోకి వెళ్లి ఎరుకన్న దొర ఉయ్యాలలో ఉన్న ఆరు నెలల పసిపాపపై లైంగిక దాడికి పాల్పడినట్లు తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రామభద్రపురం పోలీసులు పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును అప్పటి బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు , రామభద్రపురం ఎస్సై జ్ఞానప్రసాద్ దర్యాప్తు చేసి, నిందితుడ్ని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసులో నిందితుడికి శిక్ష పడే విధంగా దర్యాప్తు చేయడంలోనూ, సాక్షులను ప్రవేశపెట్టడంలోనూ క్రియాశీలకంగా పనిచేసిన బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, అప్పటి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు, ప్రస్తుత బొబ్బిలి సీఐ కె.నారాయణరావు, ఎస్సైలు జ్ఞానప్రసాద్, వి.ప్రసాదరావు, హెచ్‌సీ వీఎల్‌వీ.నారాయణ, పీసీవై. అప్పలనాయుడు, ఏఎస్సై కె.పూడినాయుడు, సీఎంఎస్. హెచ్‌సీ సీహెచ్. రామకృష్ణలను ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.

తాటిపూటి అందాలు అదుర్స్

గంట్యాడ మండలంలోని తాటిపూడి పర్యాటక కేంద్రం ప్రకృతి అందాలతో ఆకట్టుకుంటోంది. రెండు కొండల నడుమ ప్రవహిస్తున్న తాటిపూడి నీరు పర్యాటకులను చూపుమరల్చకుండా చేస్తోంది. తాటిపూడి ప్రకృతి అందాలను వీక్షించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు.


సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



రెండు కొండల మధ్య ప్రవహిస్తున్న తాటిపూడి నీరు







తాటిపూడిలో ఏర్పాటు చేసిన బోట్లు

నీతి అయోగ్ అభివృద్ధి పనులు వేగవంతం



నీతి ఆయోగ్ సంయుక్త కార్యదర్శి రాజీమన్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: నీతి ఆయోగ్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆశాఖ సంయుక్త కార్యదర్శి రాజీమన్‌కు సూచించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయానికి నీతి అయోగ్ సంయుక్త కార్యదర్శి కె.ఎస్. రాజీమన్ విచ్చేసి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలవగా కలెక్టర్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ ఆకాంక్ష జిల్లాగా పార్వతీపురం మన్యం జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రణాళికపై వివరంగా సంయుక్త కార్యదర్శితో కలెక్టర్ చర్చించారు.

తాడికొండ సచివాలయంలో దొంగతనం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామ సచివాలయం వద్ద వీఆర్‌వో పుష్పలత హ్యాండ్‌బ్యాగ్ దొంగతనం జరిగింది. బాధిత వీఆర్‌వో తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి ఎంపీడీవో తదితర అధికారులు గురువారం రావడంతో సచివాలయం వద్ద తన హ్యాండ్‌బ్యాగ్ ఉంచి, గ్రామంలోకి వెళ్లానని ఆ తర్వాత వచ్చి చూసేసరికి అక్కడ తన బ్యాగు లేదన్నారు. తోటి ఉద్యోగులను అడిగితే తమకు తెలియదన్నారని, ఆ బ్యాగులో రూ.3 వేల నగదు, బంగారం చైన్ బిల్ల, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఏటీఎం కార్డు ఉన్నాయన్నారు. ఇదే ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.